సబ్బు

పులికంటి కృష్ణారెడ్డి

పంపునీటి స్నానమంటే పడిచస్తాడు రమణ!

రమణకు యిల్లు ఉంది. రమణకే గాదు- ఆ ఊళ్ళో అందరికీ యిండ్లు ఉన్నాయి. అయితే రమణయిల్లు మాత్రం ఆ ఊరంత! రమణ యింటితో పోలిస్తే ఆ ఊరంతా గోరంత!;-

ఆ యింట్లో తినడానికి- కూర్చుని కమ్మగా రేడియో వినడానికి- స్నానానికి పానానికి- నిద్రకు

1980 చక్రపాణి ప్రథమ అవార్డు పొందిన కథ

ఖద్రతకు వేరువేరుగా ఒకదానికంటే మరొకటి అందంగా- గదు లున్నాయి. అందులో స్నానాలగది అమరికలే వేరు. ఆ గదిలో నిర్భయంగా- ముచ్చటపడితే నగ్నంగా- తొట్టిస్నానంతో తనివితీర్చు కోవచ్చు. వానజల్లులాంటి పన్నీటిజల్లు పైన పడుతూంటే- ఆనందంతో పంకర్లు తిరిగిపోవచ్చు. ధారాపాతమైన కొళాయి నీటి క్రింద జలకాలాడవచ్చు!

అయితేనేంగాని పంపునీటి స్నానమంటే పడిచస్తాడు రమణ!

ఊరిముందర బావి ఉంది. అది నడ బావి. నడబావిలో పాతాళగంగ ఉంది. రెండు విద్యుత్ మోటార్లు ఒకదానితో ఒకటి పోటీపడి ముక్కుతూ మూలుగుతూ పాతాళగంగను పంపుద్వారా పైకి తెస్తాయి.

ఆ నీళ్ళంటే మహాయిష్టం రమణకు!

బావికి యిద్దరిని ఊరు ఉంది. అద్దరిని వాడ ఉంది. ఊరిలోను వాడలోను మనుష్యులే ఉన్నారు. మనుష్యులంతా ఒక్కటేనని మహాత్ముని అడుగు జాడల్లో నడిచిన మహితాత్ములు గొంతెత్తి ఘోషిస్తూనే ఉన్నారు. అలాంటి మహితాత్ముల్లో మహితాత్ముడు ఆ గ్రామపంచాయతీ ప్రెసిడెంటు పెద్దిరెడ్డి. అప్పుడప్పుడు ఆ గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ఆ మహితాత్ముడు మీటింగులాంటిది జరిపి 'జనులేఁవిటి?... హరిజనులేఁవిటి?.... మనఁవంతా ఒకటి! జై బోలో మహాత్మాగాంధీకి!-' అని గొంతు చించుకొంటూ ఉంటాడు. అప్పుడు అందరూ ఆకాశం బ్రాలిపడేటట్లు చప్పట్లు కొడతారు.

అయితే మాటలు మాటలే!- చేతలు చేతలే!

మాటకు చేతకు పొత్తు కుదరని రోజులివి!!-

అందుకే- ఊరిలోనివాళ్ళు జనులని, వాడలోనివాళ్ళు హరిజనులని వ్యవహరింపబడుతూనే ఉన్నారు.

జనులు నీళ్ళు త్రాగుతారు. హరిజనులు నీళ్ళు త్రాగుతారు. జనులు హరిజనులు కలిసి నడబావినీళ్ళే త్రాగుతారు. నడబావి పంపునీళ్ళు ఉరవళ్ళు పరవళ్ళు మీద పారుతూంటే పైనీళ్ళు జనులు త్రాగితే క్రిందినీళ్ళు హరిజనులు త్రాగుతారు. మాసిన గుడ్డల్ని పిండుకొంటుంటారు. కాయకష్టంతో చెమటోడ్చిన శరీరాలను కడుక్కొంటుంటారు.

పారేనీటికి అంటులేదని రాజీపడతాయి యిరుపక్షాలు!

ప్రతిరోజు ఆ ఊరి పడమటి దిక్కున ఒకానొక కొండకొన కొమ్మున నిలబడతాడు సూర్యుడు. పంపునీటి కాలువవైపు ఆశగా చూస్తూఉంటాడు. పడుచుదనం గడుసుదనంతో పరాచికా లాడుకొంటూ స్నానాలుచేస్తూ ఉంటుంది. తడిగుడ్డల్లోని సొగసుతోనేమో?- సూర్యుడు తన్మయుడై నిలబడిపోతాడు. అతని మొగం

అరుణరాగ రంజితమై ఉంటుంది. ఆనందం వెల్లివిరిసి పడమటి దిశనంతా ప్రభావితంచేస్తూ ఉంటుంది. వాడికి 'కర్మసాక్షి' అని ఎవరో నామకరణం చేశారు. ఎందుకలా చేశారో తెలియదు కానీ– నిజంగా వాడు కర్మసాక్షి అయివుంటే– ఆ కాలువదగ్గరే చూపులు మళ్ళించేవాడు. అక్కడ ముడతలుపడిన దేహాలు....వీపునంటుకొన్న కడుపులు... నిలబెట్టి కోసినా మందుకు రక్తపుచుక్కలేని శరీరాలు– చెమటను నీళ్ళతో కలుపుకొంటుంటాయి. ఈ దృశ్యమే వాడికంటపడివుంటే– నిజంగా ఆ నీళ్ళతో కన్నీళ్ళను కలిపేవాడేమో?–

వాడికి ఆమాత్రం ఓపికలేకనేమో?– గుటుక్కున గూట్లోపడతాడు.

పంపునీటి కాలువదగ్గర పడుచుదనం నిర్భయంగా జలకాలాడుకొంటుంది.

ఆ సమయం ఆడవాళ్ళకని కేటాయించబడింది. అందుకే ఆ సమయంలో ఓ మగపురుగు మెదలమన్నా మెదలదు.

రమణకు ఈ సంగతి తెలియదు.

ప్రెసిడెంటు పెద్దిరెడ్డి కొడుకు రమణ!– పెరిగింది మురిపాల మూటల సందుల్లో!– చదువుకొంటున్నది నాగరకత ఒళ్ళువిరుచుకొంటున్న పట్టణాల్లో– సాధారణంగా వేసవి సెలవులు గడిపేది నీలగిరి కొండల్లాంటి ఎత్తయిన కొండల్లో–

అందుకే– ఆ పల్లెలోని పంపునీటి కాలువ పరిస్థితి– ఆ గ్రామస్థులు అనుసరిస్తున్న పద్ధతి– రమణకు తెలియవు.

అనుకోనట్లుగా ఆ ఏడాది వేసవి సెలవులు గడపడానికి రమణ పల్లెలోనే దిగాడు. ప్రెసిడెంటు పెద్దిరెడ్డిగారి కొడుకు వేసవి సెలవులు గడపడానికి పల్లెకు రావడం– ఆ పల్లెకంతా సంబరం!

ఒకనాటి సాయంకాలం. వాహ్యాళికని బయలుదేరిన రమణ ఊరికి ఉత్తరంగా నిలబడ్డాడు. చుట్టూ కోతకు వచ్చిన పొలాలు. పైరుగాలి కలగాపులగంగా పరిమళాలు నింపుకొని రివ్వున వీస్తూ ఉంది శూన్యంవైపు. రకరకాల ఆకారాలతో మేఘాలు వినిర్మల నీలాకాశాన్ని 'కాన్వాస్'గా వాడుకొంటున్నాయి. ఊర్పిడికాలం. వెచ్చని తలపులతో రైతుల ఏలపాటలు విచ్చలవిడిగ వగలుపడుతున్నాయి. తోకలు పైకెత్తి ఆలమందలు పరుగుమీద యింటిముఖం పట్టాయి. పైకి లేచిన గోధూళి సంజవెలుగులతో కలిసి కుంకుమ వెదచల్లినట్లుంది. ఆనందానుభూతితో రమణ తాడువిప్పిన మేకపిల్లలా గంతులువేస్తున్నాడు.

సహజత్వం ఎప్పటికీ సహజంగానే ఉంటుంది. తెచ్చిపెట్టుకోవడం తెచ్చిపెట్టుకొన్నట్లుగానే ఉంటుంది.

రమణగుండె ఈ సత్యాన్ని యిప్పటికి గుర్తించగలిగింది!

పొద్దు గూట్లోపడింది. కనుచీకటి ఆవరిస్తూ ఉంది. రమణ తిరుగుముఖం

పట్టాడు. క్రొత్త అనుభూతుల్ని నింపు కొన్న మనసు- రమణను గనిమలమీద తైతక్కలాడిస్తూ ఉంది. పరుగులాంటి నడకతో అతడు పడుతూ లేస్తూ నడుస్తు న్నాడు.

ఆనందమే రూపమెత్తినట్లుగా పరవ శించి పరుగుతీస్తున్న రమణ- 'ఠక్కీ' మని ఆగిపోయాడు.

రమణ కండ్లు యింతింతలైనాయి. వింతగా చూస్తున్నాయి. గుండె దడదడ లాడుతూ ఉంది. తనకు తెలియకనే తనలో ఏదో వేడి ప్రవేశించింది. కాలు ముందుకు పడమన్నా పడలేదు.

ఎవరో ఓ సుందరి!- విరిసీవిరియని కుసుమం!!- పంపునీటి కాలువలో జలకా లాడుకొంటూ ఉంది నగ్నంగా!-

రమణ ప్రయత్నంమీద చూపుల్ని స్వాధీనంలోకి తెచ్చుకోగలిగాడు. ఒక్క టంటే ఒక్క నిముషం చుట్టుక్రక్కల కలియచూశాడు. ఎవ్వరూ కనిపించలేదు. తేలికగా నిట్టూర్చి తీరికగా ఆ సుందరి వైపు దృష్టి మరల్చాడు.

ఊరకేవస్తే ఊరంతా నాదేనన్నారట!

ఊరిస్తున్న సొగసులు వారించేవాళ్ళు లేకపోయేసరికి- వయస్సులోని కళ్ళు జుర్రుకొంటున్నాయి అందినంతమేరకు!-

ఆ సుందరి- గొంతుక్కూర్చుంది నగ్నంగా!- మోవిని కాస్త పైకెత్తింది అందంగా! కండ్లుమూసుకొని ముంతతో నీళ్ళు ముంచి ముంచి పోసుకొంటూ ఉంది హాయిగా!

చీకటి చిక్కబడుతూ ఉంది.

అక్కడున్నది తానొక్కతేనన్న అభిప్రాయంలో ఆ సుందరి మునిగి ఉన్నది.

అందుకే పంపునీటి కాలువలో నిర్భ యంగా మునుగుతున్నది.

ముంతలో నీళ్ళు ముఖంమీదపడి- విశాల నేత్రాలతో వియ్యమంది- నును బుగ్గలపై జారి- వక్షస్థలితో వగలుపడి- కటిస్థలితో కబుర్లాడి- కాలువలో కలిసి పోతున్నాయి- చిలిపిగా!

'ఆ ముంతలో నీళ్ళుగా మారిపోతే?'

ఉన్నట్లుండి కలిగిన కోరికతో కొంకర్లుతిరిగిపోతున్నాడు రమణ.

'ఆడది ఒంటరిగా- అందులో నగ్నంగా స్నానంచేస్తూంటే చూడడం మహాపాతకం. ఇప్పుడు కాకపోయినా యిక కాసేపటికి ఆ అమ్మాయి కండ్లు తెరుస్తుంది. ఎదురుగా నువ్వుంటావ్! కసిరినా కసరవచ్చు. కొంద్రించి ఉమ్మినా ఉమ్మవచ్చు. లేదా- కదిలీమెద లేకుండా కుంగిపోవచ్చు. వెళ్ళిపో, ఆ పరిస్థితి ఎదురుగాకముందే వెళ్ళిపో!'- గుండెల కింది పొరల్లోనుండి ఏదో సందేశం గొంతులో కొట్లాడుతూ ఉంది.

'పాపమూ లేదు. పుణ్యమూ లేదు. మళ్ళీ మానవజన్మ - ఎవరు చూశారు. అందిన అవకాశాన్ని జారవిడుచుకోవడం

వైరితనం.అనుభవించ గలిగినంతవరకు అనుభవించు.' కోరిక కాళ్ళకు సంకెళ్ళు వేస్తూ ఉంది.

విచిత్రమైన స్థితిలో యిరుక్కొన్నాడు రమణ!

తపస్వినిలా కళ్ళుమూసుకొని_ముంతలో నీళ్ళుముంచుకొని_సావకాశంగా మొగాన కుమ్మరించుకుంటూనే ఉందా సుందరి!

నిడుపాటి వెంట్రుకలు నీళ్ళుపడడంతో చెదిరాయి. ఒంటిమీద పాయలు కట్టి పాలరాతిమీద జాలువారుతున్న నీలి నీటి సెలయేళ్ళలా భ్రమింపచేస్తున్నాయి. మోకాళ్ళను ముద్దిడుకుంటున్న చన్దోయి కన్దోయిని కవ్విస్తూ ఉంది.

తంబురకు తలను ఆనించి _ భక్తి పారవశ్యంతో కనులు మూసి,రాగాలాపన చేస్తూ మోవిని పైకెత్తి మురళీకృష్ణుని కోసం తపిస్తున్న మీరానా? లేక అనుకోని రీతిగా ప్రాణంపోసుకున్న అజంతా శిల్పమా??

రమణ గుండె మాట్లాడేసరికి గొంతు 'ఓహ్' అనింది!

సుందరి అదిరిపడి కండ్లు తెరిచింది!

తాను కలలో గూడా ఊహించలేని పరిస్థితి. ఉలిక్కిపడింది. సిగ్గు_భయము_అసహ్యము_ అన్నీ కలిసినా ఏమీచేయలేని నిస్సహాయస్థితిలో కండ్లుమూసుకొని వుంది. తల మోకాళ్ళ సందున అమాంతంగా తలదాచుకొనింది. రెండుచేతులు మోకాళ్ళను పొదివి పట్టుకొన్నాయి. తాకితే తల్లడిల్లుతూ ఒళ్ళు ముడుచుకొనే అంతర్దామరలా ఆ సుందరి క్షణక్షణానికీ ముడుచుకపోతూ ఉంది.

అయితే కండ్లు తెరిచిన ఆ ఒక్క క్షణంలోనే కనుపాపలు రమణను ఫోటో పట్టేశాయి!

ఓ మగవాడు తనని నగ్నంగా చూస్తున్నాడనుకొనేసరికి ఆ అమ్మాయి గిలగిలలాడిపోతూ ఉంది. అతని కంట పడనంత దూరం పరుగెత్తుకపోవాలని మనసు పరితపిస్తూ ఉంది.

చీరందుకోవాలి. కట్టుకోవాలి. ఆ తరువాతనే కదా పరుగెత్తాలి! ఎలా చేయాలి?_ ఎటూ తెల్చుకోలేక కుప్పగా కూర్చున్న ఆ సుందరి కుతకుత ఉడికిపోతూ ఉంది.పంపునీటి కాలువలో నీళ్ళు గోర్వెచ్చనయ్యాయి.

ఇంచుమించు అదే స్థితిలో ఉన్నాడు రమణ!

అతడి నోరు తడబడుతూ ఉంది. ఏదో అడుగుదామన్న తపన. మాటలు దొరకడం లేదు. పెదవులు తడారిపోతున్నాయి. దొరకని మాటల్ని వెదుకుతూ తడారిపోతున్న పెదవుల్ని తడుపుకొంటూ మెలికలు తిరుగుతున్నాడు.

'ఎవ్వరీ అందాలరాశి! ఇంతటి ముగ్ధమోహన సౌందర్యం ఈ పల్లెటూళ్ళో ఎలా ఊడిపడింది- అడిగితే! ఎలా

అడగాలి ?! అయ్యో! యిప్పటికే తాను ఏమనుకుంటూందో ?'

రమణ నిట్టూరుస్తున్నాడు. పంపునీటి కాలువ పరిసరాల్లో గాలి వేడెక్కింది. ఆ వేడి సుందరి తడిఒంటికి వెచ్చగా సోకుతూ ఉంది.

'ఛీ! ఏం పాడుమనిషో? కాస్తయినా యింగితజ్ఞానం ఉండక్కర్లా?? అలాగే నిలబడి మిడిగుడ్లతో మింగేసేటట్లు చూస్తున్నాడే! నోటి నిండుకు నీళ్ళుపోసు కొని తుపుక్కున ఉమ్మునా మన్నంత కోపం వచ్చిందా సుందరికి. అయినా కనుపాపల్లో పట్టేసిన ఫోటో 'నిజం చెప్పు! నా మొగం చూచి చెప్పు! నువ్వను కొన్నట్లు చేయగలవా ?' అని గుచ్చి గుచ్చి అడుగుతూ ఉంది.

అందానికి వయస్సుకు ఎప్పుడో ఒప్పందం కుదిరినట్లుంది. ఆ సుందరి అనుకొన్నట్లు చేయలేకపోయింది.

చీకటి చిక్కబడింది. ఆకాశంలో చుక్కలు మొలిచాయి.

పంపునీటి కాలువ దగ్గర పాటించ వలసిన నియమితకాలం దాటిపోతూ ఉంది. ఎవరో ఎద్దుల్ని అదిలిస్తూ అటు వస్తున్న శబ్దం చెవినిపడింది. ఉలిక్కి పడ్డాడు రమణ. ఆ దృశ్యం ఎవరికంట నయినా పడితే? అమ్మో? ఇంకేమైనా ఉందా? అసలే అవి పల్లెకొంపలు!

ఎద్దుల మెడల్లోని చిరుగంటల నాదాలు దగ్గరవుతున్నాయి. అడుగుమీద అడుగు పడినట్లుగా అడుగుల సవ్వడి ఆ జవ్వని చెవుల్లో పడింది. మెల్లగా కండ్లు తెరచి మోకాళ్ళ సందుల్లో నుండే చూచింది.

రమణ మెల్లగా ముందుకు కదిలి పోతున్నాడు.

చూడకూడదనుకొంటూనే చూస్తూ ఉండిపోయిందా సుందరి. అతడు కను మరుగయ్యేసరికి ఎగిరిపడి లేచింది. అదరాబాదరా చీరందుకొని ఒంటికి చుట్టు కొనింది. లేడిపిల్లలా ఉరికింది– రమణ మనస్సు మాత్రం పంపునీటి కాలువ దగ్గరే పడిగాపులు కాస్తుందే!

అనాటినుండే పంపునీటి స్నానమంటే పడిచస్తున్నాడు రమణ.

ఇంతకాలంగా రమణ నాలుగ్గోడల మధ్యనే కూర్చున్నాడు. పుస్తకాల దొంతర్లను ముందు పేర్చుకున్నాడు.అదే లోకం అనుకొన్నాడు. అయితే లోకంలో అంతకంటే తీయనైనది — అనుభూతిని ఆనందాన్ని యివ్వగలిగేది– మరేదో ఒకటి ఉందని అనుభవానికి వచ్చేసరికి అతడు నాలుగ్గోడల మధ్య యిమడలేక పోయాడు.

ఆ రాత్రి డాబామీద ఆరుబయట మంచం వేయించుకొన్నాడు. మెత్తటి పరుపుపైన తెల్లటి దుప్పటి– వెల్లికలా పడుకొన్నాడు. మనసును పంపునీటి కాలువ దగ్గర వదిలివచ్చిన సంగతి అతనికి తెలియలేదు. మనసు లేని కట్టె

ఎంత ప్రయత్నించినా పడక పొందలేదు. లేచి కూర్చున్నాడు.

ఎదురుగా వయ్యారాలు పోతూ ఆ నగ్నసుందరి :

తూరుపు కొండల పైన రెండు బారల ఎత్తులో నిలబడి నెలవంక.... తోటలో విరిసిన మల్లెలు సుందర స్థాయిలో మాధుర్యం— పరవశంతో రమణ పట్టు తప్పి పోతున్నాడు.

మెల్లగా పైకి లేచాడు రమణ. ఆ నగ్నసుందరిని అలానే నిలబెట్టి వెన్నెలతో పోటీపడగల తెల్లటిచీరను కట్టాడు. పట్టి నడిపించుకుని వచ్చి పట్టెమంచంపై ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. కురుల తడి ఆర్పాడు. మెడమీద కాస్త వదులుగా నిడుపాటి జడ అల్లాడు. ఆ నల్లటి జడలో తెల్లటి మల్లెలు తురిమాడు. చందమామతో పోటీపడుతున్న ముఖార విందములో కందిపప్పంత బొట్టు పెట్టాడు. లేచి నిలబడి— కాస్త వెనక్కు జరిగి— వివిధ కోణాల్లో మార్చి మార్చి ఆమె అందాన్ని విలోకించాడు.

ముగ్ధమోహనంగా వెలిగిపోతున్న ఆ సౌందర్యరాశిని వదిలిపెట్టలేక వాటేసుకొన్నాడు.

ఊహ ఎంత తీయనిది !

రెండు చేతుల మధ్య నలిగిపోతున్న దిండుపైపు దీనంగా చూశాడు రమణ.

వాస్తవం ఎంత చేదుగా ఉంటుంది?—

ఆ రాత్రి రమణకు కంటిమీద రెప్ప పడలేదు.

అక్కడ వాడలో గుడిసె. గుడిసె ముందు నుక్క మంచంలో తండ్రి. ప్రక్క నేలమీద చిరిగిన ఈతాకు చాప. చాప మీద అమ్మ. అమ్మ ప్రక్కన సుందరి. చంద్రుడు—చకోరాలు— మల్లెలు మల్లెలు— ఆ ప్రాంతానికే నిషిద్ధం.

"ఏంటే? అట్లా నసుగుతుండావ్? నిద్దరాని పట్లేదా?"— ప్రక్కలో నసుగుడు పోడుపడలేక అమ్మ అడుగుతూ ఉంది కూతుర్ని.

"అమ్మా! అయ్య అవసరం నీకు లేదు. నీ అవసరం అయ్యకు లేదు. అందుకే ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నారు. కానీ ఎవరవసరం వాళ్ళదమ్మా."

'అవసరం' అవసరాన్ని గుర్తించిన ఎవరైనా ఎవరికైనా చెప్పదగిన సమాధాన మేనుంది. అయితే ఈ దేశంలో తల్లికి కూతురు అలా చెప్పకూడదు.

అందుకే ఆ సుందరి నోరు విప్పలేదు. ఆమె కూడా మనిషే కాబట్టి ఊహలు తప్పలేదు.

ఆ సుందరి కనుపాపల్లో పట్టుకొన్న ఫోటోను తీసి ముందు పెట్టుకొంది. నొక్కునొక్కుల జుట్టు ... కొనదేలిన ముక్కు .. నవ్వితే సొట్టలుపడే బుగ్గలు అంత పొడుగూ అంత పొట్టీ కాని మితమయిన ఎత్తు—ఎంతఅందంగా ఉంటాడు?—అతని ముందే కదూ?— తనకు

తెలియకనే తన అందాన్నంతా అర వేసింది!_ ఆ గడియ అలానే శాశ్వతమై పోతే ?_

'అమ్మో! ఎంతాశే నీకు? ఎర్రంగా బుర్రంగా ఉంటే మాత్రం అంతో యింతో సదువుకోమంటే కూడా_ జాతీ నీతీ మర్చిపోయ్యేదేనా ?_ జాగర్త.... మక్కెలిరగదన్నేస్తాం!" ఒక్కరు గాదు. ఇద్దరు గాదు. ఊరూరుగా తన మీద విరుచుకపడుతున్నారు.

'అమ్మో!'_ అని అరుస్తూ తల్లిని బల్లిలా కరుచుకొనిందా పిల్ల!

"ఏం పాడు కల్లో? ఏం పీడో! బిడ్డ బిత్తరపోతావుంది."

ఆ తల్లి మనసు తల్లడిల్లింది. ఆ పిల్లదాన్ని లేపి కూర్చోబెట్టింది. గుక్కెడు నీళ్ళు గొంతులో పోసింది. మళ్ళీ పడుకోబెట్టి అందీఅందని పాత దుప్పటిని అంతంత మాత్రంగా కప్పింది. పొరకను కాళ్ళదగ్గర పెట్టింది_ పాడు కలలు రాకూడదని!

అయినా ఆ సుందరికి ఆ రాత్రి పడక పొందితే ఒట్టు!

తెల్లవారింది. తెల్లవారింది మొదలు అనుకొంటూనే ఉందా సుందరి. అందరి కంటే ముందుగా కాలువకు వెళ్ళి రావాలని. అనుకొంటూ ఉండగానే పొద్దు కుంకింది. చీకటిపడుతూవుంది. కాలువకు వెళ్ళిన వాళ్ళు ఒకొక్కక్కరుగా తిరిగి వస్తున్నారు. ఆ సుందరి కాలువకు బయలుదేరేసరికి పంపునీటి కాలువ దగ్గర పలుచబడింది. ఆమె అక్కడికి చేరేసరికి నిర్మానుష్యమయింది.

ఈ సంగతి ముందుగానే తెలిసినట్లు రమణకూడా అప్పుడే అక్కడికి వచ్చాడు.

ఆ సుందరి గొంతు కూర్చుంది_ నగ్నంగా మాత్రం కాదు. కూర్చుని ఓ బండమీద బట్టలు ఉతుకుతూ ఉంది. ఉతుకుతూ ఉందన్నమాటే కానీ_ ఊపిరంతా ఎక్కడో ఉంది. పనిమీదలేని కన్నులు తమ పని చేసుకొంటున్నాయి.

రమణ గుడ్డలు విడిచి కాలువగట్టున పెట్టాడు. కాలువలో దిగాడు. పంపు నీళ్ళు పడేచోట ఆడుకొంటున్నాడు. పట్టణంనుండి ప్రత్యేకించి తెచ్చుకొన్న సబ్బు విదేశీ సబ్బు!! కండబట్టిన ఒంటిపై పాంచి నురుగుగా మారి కాలువలో తేలిపోతూ ఉంది. పరిమళాలు వెదజల్లుతూ ఉంది.

ఆ సుందరి అతడిని చూచీచూడనట్లు చూస్తూనే ఉంది. గుండెల్లో కూడ పలుకొక్కంటున్న కోరికల్ని గొంతులోనే అణచుకొంటూ ఉంది. అతడు గమనించనపుడు ఆ నురగను తీసుకొంటూ ఉంది. వాసన చూస్తూ ఉంది ఆశగా!_ మోచేతులకు పాదాలకు రుద్దుకొంటూ ఉంది ఆప్యాయంగా.

సబ్బు నురగతో ఆమె పొందుతున్న అనుభూతిని రమణ ఓ కంట గమనిస్తూనే

ఉన్నాడు. అందుకే ఆ కాలువనీటి నంతా సబ్బునురగమయం చేస్తున్నాడు. పంపు నీటితో అతడు పరాచికాలాడు తూంటే సబ్బు నురగతో ఆమె దోబూచు లాడుతూ ఉంది. ఆ పరిసరాలు యౌవన సౌరభంతో ఎగిరెగిరి పడుతున్నాయి.

రమణ స్నానం ముగించాడు. బట్టలు తొడుక్కొన్నాడు. అడుగుమీద అడుగ్గా ఆమెను సమీపిస్తున్నాడు.

ఆ సుందరి అతడి రాకను గమనించింది. ఎగిరిపడి లేచింది. కాలికొద్దీ పరుగెత్తా లనుకొనింది. కానీ కాళ్ళాడ లేదు. ఎటూ కదల్లేక తలవంచుకొని నిలబడింది.

రమణ అల్లంతదూరంలో ఎదురుగా నిలబడ్డాడు. అంతసేపు చన్నీటిలో స్నానమాడినా అదో రకమైన వేడితో ఒళ్ళు కాలిపోతూ ఉంది. చిన్నగా తెమరాయించి గొంతు సర్దుకొన్నాడు. కొసరి కొసరి మాటల్ని కూడబలుక్కొన్నాడు.

"ఎవరమ్మా నువ్వు ?"

ఉలిక్కిపడింది సుందరి. ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి కొడుకు అడుగుతున్నాడు. చెప్పడానికి సిగ్గు. చెప్పకపోవడానికి భయం. గుండెలు గుబగుబమంటున్నాయ్. ఎట్లో శక్తినంతా కూడదీసుకొనింది.

"రాముడి కూతుర్ని !" మాట పెగల లేక పెగిలింది.

"రాముడి కూతురివా ?" వత్తి పలికాడు రమణ.

"అవును"

శ్రుతిచేసి ఉంచిన తంబుర. అందమైన తంబుర. ఎవరో లయజ్ఞానవిహీనుడు మీటితే అపశ్రుతి పలికింది.

"పేరు ?"

"వరాలు"

రమణ తల దిమ్మెక్కిపోయింది.

'ఇది పల్లెటూరి సౌందర్యంకాదే !' అని ఆశ్చర్యపడిన రమణ ఆ అమ్మాయి మరీ అమగంటిన జాతినుండి అని వినేసరికి మరింత ఆశ్చర్యపడ్డాడు.

వరాలు గమనిస్తూనే ఉంది.

ఆ మరుపటిరోజు అతగాడి కాలు కదలమన్నా కదలలేదు. ఆ రోజు కాలు

నిలదొక్కుకొన్నా నిలిచేటట్లుగా లేదు. ఎంతలో ఎంత మార్పు?

రమణ వెనక్కు తిరిగాడు. మెల్లగా ముందుకు సాగాడు.

వరాలు పెదవులు వంపులు తిరిగాయి. ఆ వంపుల సందుల్లో వచ్చీరాని ఓ చిరునవ్వు.

పిండిన బట్టల్ని ఓ బుట్టలో వేసుకొనింది వరాలు. బుట్టను తీసి చంకన వేసుకొనింది. వరాలు కూడా బయలు దేరింది. ఆ పూటకు వాళ్ళిద్దరు విడిపోయారు— రమణ ఊరివైపు—వరాలు వాడ వైపు!—

ఆ ముందటినాటి అనుభూతిల్ని పదపదిలంగా కావలిబెట్టి—తాను మాత్రం ఇంట్లో అడుగుపెట్టి— కంచంలో చేయి పెట్టినట్లు పెట్టి— గుట్టుగా డాబాపై కెక్కాడు రమణ. అదే పట్టెమంచము అదే మెత్తటి పరుపు.... అవే వెన్నెల వెలుగులు.... అవే మల్లెల మత్తులు— అయినా మనసు నిండా చీకటి! ఆగిన రైలెక్కడానికి ఆతురపడుతున్న ప్రయాణీకుల్లా తలను చుట్టి ఆలోచనలు. పడక పొందక లేచి కూర్చున్నాడు.

ఎదురుగా వరాలు!

గుడ్లు తుక్కుంటున్నట్లు ఉతుక్కుంటూ ఆదోగకంగా చూస్తూ ఉంది.

"ఎందుకమ్మా అలా చూస్తున్నావ్?"

"మీ రెందుకట్లా ఆలోచిస్తా ఉంటారు?"

"ఆలోచించడంలేదు. ఆవేదన పడుతున్నాను."

"ఎందుకూ?"

"దేవు డెందుకిలా చేశాడా?— అని!"

"మనచేతగానితనాన్ని దేవుడి మీద రుద్దడం తప్పు కదూ?"

"మరి దీన్నేమనాలి?"

"ఏమనాలంటారు? దేవుడు బురదలో తామరల్ని పూయించడం లేదా? ముళ్ళ సందుల్లో గులాబీలను తొడిగించడం లేదా?— అవి పూజకు ఉపయోగింపబడడం లేదా?— మనుష్యుల మధ్య కులాల అడ్డుగోడల్ని దేవుడు కట్టలేదు. ఒకనాటి అవసరంతో వాటిని మనమే కట్టుకొన్నాం. అవసరం లేదనుకున్నప్పుడు పడగొట్టాలి! ఏం?— అనుకొంటే మీరాపని చేయలేరా?"— వరాలు నిలదీసి అడుగుతున్నట్లుంది.

"అవును. కొట్టాలి! దుమ్ము దుమ్ముగా పడగొట్టాలి!" ఆవేశంతో అంటున్నాడు.

"ఏంది సినయ్యా? ఏందో కొట్టాల గిట్టాలంటుండావే! ఎవుర్నబ్బా?"

ఉలిక్కిపడి ఈ లోకంలో పడ్డాడు రమణ.

ఎదురుగా పుల్లయ్యతాత. పాలగ్లాసు పట్టుకొని నిలబడి ఉన్నాడు.

"అన్నం కూడా సరిగ్గా తిన్లేదని అమ్మ అల్లాడిపోతావుంది. మఱుసుండక తెచ్చినా! ఈ పాలట్లా గొంతులో

పోసుకో నాయినా !" బ్రతిమాలాడు పుల్లయ్య.

"అక్కడపెట్టిపో తాతా !"— పుల్ల విరిచినట్లనేసరికి పుల్లయ్యతాత గ్లాసు నక్కడపెట్టి వెళ్ళిపోయాడు.

రమణ పాలు త్రాగలేదు సరికదా – ఆ రాత్రి నిద్ర కూడ పోలేదు.

పొద్దు పుట్టింది. పుట్టిన పొద్దు కుంకింది. ఆ రోజు మాత్రమే కాదు. వరుసగా పది రోజులు— పొద్దు పుట్టింది. పుట్టిన పొద్దు కుంకింది.

ఈ పదిరోజులు సందకాడ సద్దు మణిగిన వేళ పంపునీటి కాలువదగ్గర పిళ్ళిద్దరి సందడే !— ఇద్దరి గుండెల్లో పెద్ద పెట్టున అలజడే !!—

పదకొండోరోజు కూడా తెల్లవారింది.

రమణ ఓ నిర్ణయానికి వచ్చేశాడు.

తన నిర్ణయంతో తండ్రి స్వయార్జితం అల్లుళ్ళపరం కావడం ఖాయమని తెలుసు.

అయినా అతడు విద్యార్థిగా వర్ణాంతర వివాహాలపై యిచ్చిన ఉపన్యాసాలు.... ఎందరో మహాత్ములు చేసిన త్యాగాలు అతన్ని ముందుకు నెట్టుతున్నాయి. తాను చదువుకొంటున్న కళాశాలలో ఓ హరిజన కుర్రవాడు, ఓ రెడ్ల అమ్మాయి కళ్లెదుటే పెళ్లిచేసుకొన్నారు. కాలేజీ కాలేజీగా అతడి నభినందించింది. ప్రభుత్వం పారితోషికమిచ్చి ప్రోత్స హించింది. చదువు పూర్తయితే ఉద్యో గావకాశాలా ? సరేసరి !—

తన నిర్ణయాన్ని నిమిరి వదిలాడు రమణ.

పురులు విప్పి నాట్యమాడుతూ ఉంది నిర్ణయం గుండెల్లో !

ఆ రోజుకూడా పొద్దు కుంకింది. సద్దు మణిగింది.

పంపునీటి కాలువ యిద్దరి సందడితో సంబరాలుపోతూ ఉంది.

తన నిర్ణయాన్ని వరాలుచెవిని పడ వేద్దామని రమణతహతహపడుతున్నాడు. పంపునీటి కాలువ నబ్బు నురగతో మిసమిస లాడుతూ ఉంది.

అంతలోనే కూడపలుక్కొన్నట్టుగా ఊళ్లోనుండి కొంతమంది వాడలోనుండి కొంత మంది యువకులు అక్కడ ఊడిపడ్డారు.

రమణ వాళ్ళను చూచి ఉలిక్కి పడ్డాడు. రమణను చూస్తూన్నవాళ్ళు అందరూ ఒకరిమొగమొకరు చూచుకొం టున్నారు. వరాలు తన పని తన దన్నట్లుగా ఉంది.

జిల్లాస్థాయిలో కబాడీ పోటీలు మరో పదిరోజుల్లో నిర్వహింపబడపోతున్నాయి. ఊరిలోని వాడలోని యువజన సంఘ సభ్యులు ఆ పోటీలో పాల్గొనడానికి తయారవుతున్నారు. ఆడిన తరువాత స్నానమాడడానికి వచ్చారు. ఆడవాళ్ళ కోసం కేటాయించిన కాలం దాటి పోయింది కదా ?—అని !

ఓ నిముషం కాలువ గట్టున నిలబ డింది యువతరం.

ఏదో ముచ్చటపడి రమణ వేళకాని వేళ పంపునీటి స్నానానికి వస్తే పగటి పూట పని తీరక గుడ్డలు పిండుకోవడానికి వరాలు వచ్చి ఉంటుందని యువతరం చూపులతోనే సర్దిచెప్పుకొనింది. ఆ పై కేరింతలు కొడుతూ కాలువలో పడింది. పై నీళ్ళలో ఊళ్ళోవాళ్ళు పడితే కింది నీళ్ళల్లో వాడలోవాళ్ళు పడ్డారు. పంపు నీటి కాలవదగ్గర కోలాహలానికి కొదువ లేకపోయింది.

ఊళ్ళో యువకులు రమణతో కల శారు. సువాసనల్ని వెదజల్లుతున్న స బ్బు ను తెగ మెచ్చుకుంటున్నారు. ర మ ణ చేతుల్లోనుండి ఆ సబ్బును లాక్కొన్నారు. నిముషాలమీద చేతులు మారిపోతుందా సబ్బు. హుషారుగా పై నీళ్ళల్లో స్నానాలు సాగుతుంటే సబ్బు నురగ తెట్టెలుగట్టి జోరుగా తేలిపోతూ ఉంది.

దర్జాగా చూస్తూ నిలబడ్డాడు రమణ.

క్రింది నీళ్ళల్లో స్నానం చేస్తున్నదీ కుర్రవాళ్ళే!

ఆ కుర్రవాళ్ళు సబ్బునురగను రెండు చేతులతో జవురుకొంటున్నారు. తలకు ఒంటికి మార్చి మార్చి రుద్దుకొంటున్నారు. కొందరు దోసిటబట్టి ఊపిరి ఎగపీల్చి నంతవరకె గపీల్చి ఆ వాసనతో పరవ శిస్తున్నారు. మెలికలు తిరిగిపోతున్నారు. సబ్బు రుద్దుకొంటున్న వాళ్ళవైపు అదే పనిగా చూస్తున్నారు. ఆచూపుల్లో ఆశ ఉంది. అభ్యర్థన ఉంది.అయితే గమనించే వాళ్ళెవరు?

అలవాటు మేరకు ఆ సబ్బు నురగను దోసిటబట్టింది వరాలు. వంచిన తల ఎత్తకుండానే ఒక కంట గమనిస్తూనే ఉంది_ అక్కడ జరుగుతున్న జల క్రీడల్ని!

క్రింది నీళ్ళను చూచి పై నీళ్ళు వగలుపడుతూ వళ్ళు విరుచుకొంటు న్నాయి. ఒళ్ళు విరుచుకొంటూ పగల బడి నవ్వుతూన్నాయి_ ను రు గు లు కక్కుతూ!

దోసిటబట్టిన సబ్బునురగను విసిరి నీళ్ళల్లో కొట్టింది వరాలు!

వాడలోని యువకులు తమ ఆశల్ని ఆ నీళ్ళల్లోనే కలిపారు. కలిసికట్టుగా కాలువ పక్కన పుట్టమీద పడ్డారు. తలా పిడికెడు మట్టినందుకున్నారు. పై నీళ్ళల్లో పరిమళాలు పోయే సబ్బు!_ క్రింది నీళ్ళల్లో పనికిరాని పుట్టమట్టి!! _

యువకులు స్నానాలు ముగించారు!

ఊళ్ళోని యువకులు పరిమళాలు పోయే సబ్బుతో!_ వాడలోని యువ కులు ప్రకృతి ప్రసాదించిన పుట్ట మట్టితో!_ ఆ తరువాత వాళ్ళు విడిపో యారు. ఊళ్ళోనివాళ్ళు ఊరివైపు, వాడలోనివాళ్ళు వాడవైపు.



ఆ సమయం కోసమే ఎదురు చూస్తున్న రమణ గొంతు సర్దుకొన్నాడు.

"వరాలూ నిన్ను నేను పెళ్ళాడుతాను"

ఆమాట చెవిన పడడంతో ఒక్కసారి తల పైకెత్తింది వరాలు. ఒక్క చూపు విసిరింది వరాలు. నరనరాలను తాకిందా చూపు.

"ఎందుకలా చూస్తున్నావ్ ?" సందేహంగా అడిగాడు రమణ.

"చూడల్సినట్లు చేశారు కాబట్టి చూస్తున్నా !"

"నేనేం చేశాను ?"

"ఎవురు చేసింది వాళ్ళకు తెలిస్తే ఏ బెడదా ఉండేది కాదు."

ఇదో ఈ అడ్డమాటలు మాని అడిగిందానికి బదులు చెప్పు."

అసహనం అడుగుపెడుతూ ఉంది రమణ మాటల్లో. తెగేదాకా లాగకూడదనుకొనింది వరాలు. సూటిగా అడగడానికే తలపడింది.

"అక్కడ పోతుందేవాళ్ళెవురు?"

"ఊళ్ళోవాళ్ళు."

"ఇదో యిటుపోతూండే వాళ్ళెవురు?"

"వాడలోవాళ్ళు"

"వాళ్ళూ వీళ్ళూ అందరూ మనుషులే గదా ?"

"అవును."

"అయితే వాళ్ళకిచ్చిన సబ్బు వీళ్ళ కెందు కివ్వలేకపోయారు ?"

"వాళ్ళడగలేదు కాబట్టి !"

"అడుక్కోవడమంటే మట్టి కొట్టుకోవడం బాబూ ! కాయకష్టం జేసి బతికే జన్మాలు ముష్టికిష్టపడవు."

"అంటే ?"

"అంటేనా బాబూ ! మనుసులంతా ఒకటే అయితే గూడా కొందరికి లాక్కొనే సొతంత్రం వుంటే– మరి కొందరికి అడుక్కొనే అర్హత గూడా ఉండదు బాబూ."

"ఆఁ !"

"అవును బాబూ ! వాడలోని కుర్రాళ్ళ తపన గమనించారా మీరు ?– ఎంగిలి మెతుకులకోసం ఎగబడే కుక్కల్లా మీ ఒంటిమీద నుండి జారిపడిన సబ్బునురగ కోసం ఎలా ఎగబడ్డారో వాళ్ళు. అసలు మీరెక్కడ చూడగలుగుతార్లే ?– ఈ వారం పదిరోజులనుండి తమరుచూస్తూనే వున్నారు. ఆ సబ్బునురగతో నే నెంత సంబరపడిపోయానో ? అయినా ఒక్క నాడైనా 'ఇదో ! యిందమ్మా సబ్బు ! ఆ నురగతోనే ఎందుకట్లా సతమతమై పోతావ్ ?' అని మనసారా ఒక్కమాటన లేకపోయారు. ఈ మాత్రం గుండెలేని మనిషి పెండ్లిచేసుకొంటాడా బాబూ పెండ్లి !"

వరాలు వశం తప్పింది.

రమణ తల దిమ్మెక్కిపోయింది.

ఓ సబ్బునురగ తెట్టె !– గడ్డిపోచ అడ్డుపడితే అంతవరకు ఆగి ఉండింది. అప్పుడు ముందుకు సాగింది. నీటిపైన తేలిపోతూ ఉంది. అలా అలలమీద తేలిపోతూ పోతూ కొద్దికొద్దిగా కరుగుతూ పూర్తిగా నీళ్ళల్లో కలిసిపోతూ ఉంది.

"అసలు మీ మనసుల్లో మురికి తరతరాలుగా పేరకపోయింది. ఆ మురికిని కడగాలంటే ఈ సబ్బులు పనికిరావు. మనసుల్ని కడిగే సబ్బులు తయారు కావాల. దీనికింకా చాలా కాలం పడుతుంది బాబూ ! చాలాకాలం పడుతుంది!"

ఒక్క క్షణం ఆగింది వరాలు.

మరొక్క క్షణం వాళ్ళిద్దరి మధ్య మౌనం.

"అంతవరకు ఎదురుచూచే ఓపికుంటుందా బాబూ ?"

ఎత్తిపొడిచింది వరాలు.

రమణ తల వాలింది ?

ఒక్క ఊపులో తడిబట్టల బుట్టను చంకన వేసుకొని వరాలు వాడవైపు సాగింది !!

— ——